# నేటి నుంచి ప్రజాపాలన

- నియోజకవర్గ, మండల ప్రత్యేక అధికారుల నియామకం
- విజయవంతం చేయాలి : ఖమ్మం కలెక్టర్ వీపీ గౌతమ్



మామిళ్లగూడెం, డిసెంబర్ 27 : రాష్ట్ర ప్రభుత్వం అభయహస్తం పేరుతో ఆరు గ్యారెంటీల అమలుకు చేపట్టిన ప్రజాపాలన కార్యక్రమం గురువారం ప్రారంభంకానున్నది. నేటి నుంచి వచ్చే జనవరి 6వ తేదీ వరకు ప్రజల నుంచి అధికారులు దరఖాస్తులను స్వీకరించనున్నారు. గ్రామ పంచాయతీ కార్యాలయాలు, పట్టణ వార్డుల్లో అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. గ్రామ, వార్డు, డివిజన్‌స్థాయిలో విజయవంతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు కలెక్టర్ వీపీ గౌతమ్ నియోజకవర్గ, మండల స్థాయిలో ప్రత్యేక అధికారులను నియమించారు. గ్రామ పంచాయతీ కార్యాలయాలు, మున్సిపాల్టీలు, నగరపాలక సంస్థల్లో డివిజన్‌లోని ప్రధానకేంద్రాల వద్ద దరఖాస్తులు స్వీకరించనున్నారు. అనంతరం వాటిని పరిశీలన చేసి ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం లబ్ధిదారులను గుర్తిస్తారు. నియోజకవర్గ, మండల ప్రత్యేక అధికారులు నిరంతర పర్యవేక్షణలో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ ఆదేశించారు.

## ప్రతి దరఖాస్తుకు నంబర్ వేయాలి

- నియోజకవర్గస్థాయిలో ప్రత్యేక అధికారుల పర్యవేక్షణ
- ప్రతి మండలానికో స్పెషలాఫీసర్ నియామకం
- భద్రాద్రి కలెక్టర్ ప్రియాంక ఆల



మాట్లాడుతున్న కలెక్టర్ ప్రియాంక ఆల

భద్రాద్రి కొత్తగూడెం, డిసెంబర్ 27 (నమస్తే తెలంగాణ) : ప్రజాపాలన, అభయ హస్తం గ్యారెంటీలకు ఈ నెల 28వ తేదీ గురువారం నుంచి గ్రామ, వార్డు సభల్లో దరఖాస్తులు స్వీకరించనున్నట్లు కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆల తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం తలపెట్టిన ప్రజాపాలన కార్యక్రమంపై నియోజకవర్గ, మండల ప్రత్యేక అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, తహసీల్దార్లు, ఎంపీడీవోలతో బుధవారం కలెక్టరేట్ నుంచి టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లాలోని ఐదు నియోజకవర్గాల స్థాయిలో పర్యవేక్షణకు ఐదుగురు ప్రత్యేకాధికారులు, 22 మండలాలకు మండల ప్రత్యేక అధికారులను నియమించినట్లు పేర్కొన్నారు. గ్రామ పంచాయతీ, వార్డుల్లో నిర్వహించే గ్రామసభలపై విస్తృత ప్రచారం చేయాలని అధికారులకు సూచించారు. దరఖాస్తు ప్రతి కుటుంబానికి చేరాలని, దరఖాస్తులు పూర్తి చేసేందుకు హెల్ప్‌డెస్కులు ఏర్పాటు చేయాలన్నారు. జనవరి 6వ తేదీ వరకు ప్రతిరోజు ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 6 గంటల వరకు గ్రామసభలు నిర్వహించాలని ఆదేశించారు. ప్రతి దరఖాస్తుకు నంబర్ వేసి అదే నంబర్ రిజిస్టర్‌లో నమోదు చేయాలన్నారు. ఏ అంశంపై దరఖాస్తు చేసుకున్నారో దరఖాస్తులో టిక్ చేయాలని సూచించారు. మండలస్థాయి సిబ్బందికి ట్రైనింగ్ ఇవ్వాలని, గ్రామసభ నిర్వహించే ప్రాంగణంలో టేబుల్స్, కుర్చీలు, తాగునీరు, షామియానాలు ఏర్పాటు చేయాలన్నారు. ప్రజాపాలన దరఖాస్తుతోపాటు రేషన్‌కార్డు, ఆధార్‌కార్డు జిరాక్సు, కుటుంబ పెద్ద పాస్‌ఫొటో జత చేయాలని సూచించారు.

### నియోజకవర్గ ప్రత్యేక అధికారులు..

| | |
|---|---|
| ఖమ్మం | – ఆదర్శ్ సురభి (నగరపాలక సంస్థ కమిషనర్) |
| పాలేరు | – ఎం.రాజేశ్వరి (భూసేకరణ ప్రత్యేక ఉప కలెక్టర్) |
| మధిర | – జి.గణేశ్(ఖమ్మం ఆర్డీవో) |
| వైరా | – బి.సత్యప్రసాద్ (స్థానిక సంస్థల అదనపు కలెక్టర్) |
| సత్తుపల్లి | – ఎస్.అశోకచక్రవర్తి (సత్తుపల్లి ఆర్డీవో) |

### మండల ప్రత్యేక అధికారులు..

| మండలం | ప్రత్యేక అధికారి పేరు |
|---|---|
| ఖమ్మం అర్బన్ | ఈ.సోమశేఖర్ శర్మ–డీఈవో |
| కూసుమంచి | జి.శ్రీలత–డీఎస్‌వో |
| కొణిజర్ల | టి.సుమ–డీడబ్ల్యూవో |
| సత్తుపల్లి | టి.సునీల్‌రెడ్డి–డీవైఎస్‌వో |
| బోనకల్ | సీహెచ్. వెంగమ్మ–ఏసీఎల్ |
| ముదిగొండ | ఎన్.విజయలక్ష్మి–డీడీ టీడబ్ల్యూవో |
| పెనుబల్లి | డి.శ్రీనివాసులు–ఏడీ ఎస్ఎల్ఆర్ (సర్వేల్యాండ్ రికార్డ్స్) |
| వేంసూరు | ఎస్.హుస్సేన్–డీఏవో (ఆడిట్) |
| చింతకాని | ఎం.సతీష్–ఏడీ అగ్రికల్చర్ |
| ఏన్కూరు | జి.సంజయ్‌కుమార్–ఏడీ మైన్స్ |
| కల్లూరు | పి.సునీత–డీఎం–మార్క్‌ఫెడ్ |
| కామేపల్లి | కె.రవిబాబు–డీఐఈవో |
| ఖమ్మంరూరల్ | జి.జ్యోతి–డీబీసీడబ్ల్యూవో |
| మధిర | శ్రీనివాస్–సీపీవో |
| నేలకొండపల్లి | కె.శ్రీరామ్–డీఈవో (ఎంప్లాయిమెంట్) |
| రఘునాథపాలెం | ఏ.విజయకుమారి–డీసీవో |
| సింగరేణి | అజయ్‌కుమార్–జీఎం–డీఐసీ |
| తిరుమలాయపాలెం | ఎం.విజయనిర్మల–డీఏవో(అగ్రికల్చర్) |
| వైరా | కె.సత్యనారాయణ–డీడీ(సోషల్ వెల్ఫేర్) |
| ఎర్రుపాలెం | డాక్టర్.బి వేణుమనోహర్–డీడీ(వెటర్నరీ) |



ఓటుహక్కును వినియోగించుకున్న కార్మికులు

# సింగరేణి ఎన్నికలు ప్రశాంతం

- 94.20 పోలింగ్‌శాతం నమోదు
- స్వచ్ఛందంగా ఓటుహక్కు వినియోగించుకున్న కార్మికులు



మెయిన్ ఆస్పత్రి వద్ద కార్మికులతో టీబీజీకేఎస్ నాయకులు

### కొత్తగూడెం రీజియన్‌లో పోలింగ్ సరళి

| ఏరియా | ఓటర్లు | పోలైన ఓట్లు | శాతం |
|---|---|---|---|
| కొత్తగూడెం కార్పొరేట్ | 1,191 | 1,149 | 96.47 |
| కొత్తగూడెం ఏరియా | 2,326 | 2,207 | 94.88 |
| ఇల్లెందు ఏరియా | 614 | 604 | 98 |
| మణుగూరు ఏరియా | 2,450 | 2,378 | 95.06 |

కొత్తగూడెం సింగరేణి, డిసెంబర్ 27 : సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. సంస్థ వ్యాప్తంగా బుధవారం జరిగిన గుర్తింపు సంఘం ఎన్నికల్లో 39,773 మంది కార్మికులకు గాను 37,468 మంది తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. 94.20 శాతం పోలింగ్‌శాతంగా నమోదైందని ఎన్నికల అధికారులు తెలిపారు. కార్మికులు స్వచ్ఛందంగా తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. కొత్తగూడెం ఏరియా రీజియన్ పరిధిలోని కార్పొరేట్, కొత్తగూడెం ఏరియా, ఇల్లెందు, మణుగూరు ఏరియాల్లో కార్మికులు తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీ, టీబీజీకేఎస్, ఇతర కార్మిక సంఘాల నాయకులు పోలింగ్‌బూత్‌ల సమీపంలో టెంట్లు ఏర్పాటు చేసుకొని ప్రచారం చేశారు. కొత్తగూడెం కార్పొరేట్‌లో 1,191 మంది కార్మికులకు 1,149 మంది తమ ఓటువేశారు. ఈ ఎన్నికల ప్రక్రియను రిటర్నింగ్ అధికారి, డిప్యూటీ చీఫ్ లేబర్ కమిషనర్ శ్రీనివాసులు పరిశీలించారు.

**మణుగూరు ఏరియాలో...**

మణుగూరుటౌన్, డిసెంబర్ 27 : మణుగూరు ఏరియాలో బుధవారం జరిగిన గుర్తింపు సంఘం ఎన్నికల్లో 97 శాతం పోలింగ్ నమోదైనట్లు అధికారులు తెలిపారు. 7 పోలింగ్ కేంద్రాల్లో మొత్తం 2,450 మంది సింగరేణి ఉద్యోగులకు.. 2,378 మంది తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. మిగతా ఉద్యోగులు వివిధ కారణాలతో ఓటింగ్‌లో పాల్గొనలేదని తెలిపారు.

**రామవరం ప్రాంతంలో..**

రామవరం, డిసెంబర్ 27 : రామవరం ఏరియాలో మొత్తంలో 6 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయగా 2,326 మందికి 2,207 మంది ఓటుహక్కును వినియోగించుకున్నారు. 94.9 పోలింగ్ శాతం నమోదైంది. పీవీకే 5 ఇంక్లైన్ ఏజెంట్ ఆఫీస్ పోలింగ్‌కేంద్రంలో 566 మందికి 536 మంది ఓటువేశారు. జీకేవోసీ క్యాంటీన్ హాల్‌లో 238 మందికి 225, జేవీఆర్‌వోసీ టూ రెస్ట్ హాల్‌లో 613 మందికి 579, జేవీఆర్ సీహెచ్‌పీ కాన్ఫరెన్స్‌హాల్‌లో 240 మందికి 228, కిష్టారం వీటీసీ హాల్‌లో 137 మందికి 130, ఏరియా వర్క్‌షాప్‌లో 532 మందికి 509 మంది ఓటు వేశారు. గుర్తింపుకార్డులను తీసుకొచ్చిన కార్మికులనే ఓట్లు వేయించారు. ఐడీకార్డులు లేనివారికి పోలింగ్‌స్టేషన్ల వద్ద తాత్కాలిక ఐడెంటీ కార్డులను ఏర్పాటు చేశారు. టూ టౌన్ సీఐ రమేశ్‌కుమార్, ఎస్సై జుబేదా, శ్రీనివాస్, సింగరేణి సెక్యూరిటీ సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.

**కేవోసీలో 97 శాతం పోలింగ్**

టేకులపల్లి, డిసెంబర్ 27 : టేకులపల్లి మండలం ఇల్లెందు సింగరేణి ఏరియా కోయగూడెం ఉపరితల గనిలో సింగరేణి ఎన్నికలు బుధవారం ప్రశాంతంగా ముగిశాయి. కేవోసీలో ఉదయం 7 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరిగిన పోలింగ్‌లో మొత్తం 122 మంది ఓటర్లకు.. 118 మంది కార్మికులు ఓటు హక్కు వినియోగించుకున్నారు. కేవోసీలో పోలింగ్ 97 శాతం నమోదైంది. పోలింగ్ కేంద్రాన్ని ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య పరిశీలించారు. కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.



పోలింగ్ కేంద్రం వద్ద సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి

**సత్తుపల్లిలో...**

సత్తుపల్లి, డిసెంబర్ 27 : సత్తుపల్లిలోని జేవీఆర్ ఓసీ, కిష్టారం ఓసీ, సీహెచ్‌పీలలో 94.6 శాతం పోలింగ్ నమోదైంది. మొత్తం 990 ఓట్లకు.. 937 మంది ఉద్యోగులు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. సత్తుపల్లిలోని మూడు ప్రాంతాల్లో అధికారులు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయగా.. జేవీఆర్ ఓసీ పీవో వెంకటాచారి, కల్లూరు ఆర్డీవో అశోక్‌చక్రవర్తి, ఏసీపీ రామానుజం ఎన్నికలను పర్యవేక్షించారు. సత్తుపల్లిలోని జేవీఆర్ ఓసీలో 613 ఓట్లకు.. 579, కిష్టారం ఓసీలో 240 ఓట్లకు.. 228, సీహెచ్‌పీలో 137 ఓట్లకు.. 130 మంది తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఎమ్మెల్యే మట్టా రాగమయి పోలింగ్ కేంద్రాలను సందర్శించి.. ఐఎన్‌టీయూసీ నాయకులతో మాట్లాడి పోలింగ్ ప్రక్రియను పరిశీలించారు. ఏసీపీ రామానుజం ఆధ్వర్యంలో సీఐలు మోహన్‌బాబు, హనూక్‌లు పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

## 'సింగరేణి'లో ఐఎన్‌టీయూసీదే గెలుపు

భద్రాద్రి కొత్తగూడెం, డిసెంబర్ 27 (నమస్తే తెలంగాణ)/ కొత్తగూడెం సింగరేణి: సింగరేణి గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల ఓట్ల లెక్కింపు బుధవారం అర్ధరాత్రి ముగిసింది. కొత్తగూడెంలో ఉత్కంఠభరితంగా సాగిన ఓట్ల లెక్కింపులో గెలుపు ఐఎన్‌టీయూసీని వరించింది.

| ఏరియా | ఐఎన్‌టీయూసీ | ఏఐటీయూసీ | మెజార్టీ |
|---|---|---|---|
| కొత్తగూడెం కార్పొరేట్‌లో.. | 549 | 253 | 286 |
| కొత్తగూడెం ఏరియా | 1129 | 896 | 233 |
| ఇల్లెందు ఏరియా | 310 | 264 | 46 |
| మణుగూరు ఏరియా | 778 | 776 | 2 |



పోలింగ్ కేంద్రాన్ని పరిశీస్తున్న ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య



ఓట్లను లెక్కిస్తున్న అధికారులు

## ప్రజా పాలన పర్యవేక్షణాధికారిగా సీనియర్ ఐఏఎస్ రఘునందన్‌రావు

మామిళ్లగూడెం, డిసెంబర్ 27 : ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రజా పాలన పర్యవేక్షణాధికారిగా సీనియర్ ఐఏఎస్ అధికారి, వ్యవసాయ శాఖ కమిషనర్ రఘునందన్‌రావును నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈయన ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌గా ఉన్నప్పుడు ఉమ్మడి జిల్లాలో డీఆర్‌డీవో, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ, ఖమ్మం ఆర్డీవో, జాయింట్ కలెక్టర్‌గా పని చేశారు. నాటి ప్రభుత్వం అమలు చేసిన ప్రజల వద్దకు పాలన కార్యక్రమం సమయంలో డీఆర్‌డీవోగా ఉన్న ఆయన సమర్థంగా పనిచేసి జిల్లాను ముందు వరుసలో నిలబెట్టిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో జిల్లాపై మంచి పట్టున్న సీనియర్ అధికారిని ఉమ్మడి ఖమ్మం జిల్లాకు ప్రజా పాలన పర్యవేక్షణాధికారిగా నియమించారు.

## రాష్ట్రస్థాయి అండర్-17 బాలికల క్రికెట్ జట్టు ఎంపిక



ఎంపికైన బాలికల క్రికెట్ జట్టు సభ్యులతో సెలక్షన్ కమిటీ

అశ్వాపురం, డిసెంబర్ 27: వచ్చే నెలలో కేరళలోని త్రివేండ్రంలో జరగనున్న జాతీయస్థాయి అండర్–17 బాలికల క్రికెట్ పోటీల్లో పాల్గొనే రాష్ట్ర జట్టును తెలంగాణ స్టేట్ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ బుధవారం ప్రకటించింది. ఈ జట్టు ఎంపిక పోటీలు ఐదు రోజులపాటు స్థానిక గౌతమీనగర్ కాలనీలోని మైదానంలో జరిగాయి. ప్రతిభ ఆధారంగా జట్టను నిర్వాహకులు ఎంపిక చేశారు. ఈ జట్టుకు కెప్టెన్‌గా మణుగూరు జిల్లా పరిషత్ హైస్కూల్ పదోతరగతి విద్యార్థిని వైష్ణవిరత్న ఎంపికైంది. సభ్యులుగా అక్షిత(రంగారెడ్డి), స్వాతి(మహబూబ్‌నగర్), హర్షిత(రంగారెడ్డి), అనన్య(ఖమ్మం), వైశాలి(మహబూబ్‌నగర్), ధృతి(రంగారెడ్డి), ఇందు(మహబూబ్‌నగర్), వైష్ణవి(రంగారెడ్డి), భాగ్య(ఖమ్మం), బి.శ్రీజ(నిజామాబాద్), వర్ష(నిజామాబాద్), అక్షయ(హైదరాబాద్), శ్రీతులసిరెడ్డి(ఆదిలాబాద్), అస్మిత సింగ్(మెదక్), స్నిగ్ధ(రంగారెడ్డి) స్టాండ్‌బైస్‌గా కె.ఝాన్సీ(ఖమ్మం), నాగశ్రీచరిత(రంగారెడ్డి), అక్షర(మహబూబ్‌నగర్)ను నిర్వాహకులు ఎంపిక చేశారు.

# పొద్దెక్కినా పొగమంచే..

లైట్లు వేసుకొని వాహనదారుల ప్రయాణం

చలికి తాళలేక ఇళ్ల వద్ద మంట కాగుతున్న జనం

పడిపోతున్న ఉష్ణోగ్రతలతో ప్రజల అవస్థలు





బారెడు పొద్దెక్కినా పొగమంచు వీడడం లేదు. ఉమ్మడి జిల్లాలో రోజురోజుకూ రాత్రి ఉష్ణోగ్రతలు పడిపోతుండడం.. చలి తీవ్రత అంతకంతకూ ఎక్కువవుతుండడంతో జనం ఇళ్ల నుంచి బయటకు రావాలంటే జంకుతున్నారు. బుధవారం ఉదయం 10 గంటలు దాటినా మంచు తెరల నుంచి సూరీడి జాడ కనిపించకపోవడంతో ఇబ్బంది పడుతున్నారు. ఉదయం వాహనదారులు లైట్లు వేసుకొని మరీ ప్రయాణిస్తుండగా.. బాటసారులకు సైతం ఎదుటివారు కనిపించకపోవడంతో అవస్థలు పడుతున్నారు. కొన్నిచోట్ల చలి తీవ్రతను తట్టుకోలేక చలిమంటలు కాగుతున్న పరిస్థితి ఉమ్మడి ఖమ్మం జిల్లాలో నెలకొన్నది.

– నమస్తే నెట్‌వర్క్







## రాష్ట్రస్థాయి క్రీడలను విజయవంతం చేయాలి

భద్రాచలం ఐటీడీఏ పీవో ప్రతీక్ జైన్



సమావేశంలో మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో ప్రతీక్ జైన్

భద్రాచలం, డిసెంబర్ 27 : నాలుగు ఐటీడీఏల పరిధిలో జోనల్ స్థాయిలో ఎంపికైన క్రీడాకారులకు వచ్చే నెల 4 నుంచి 6వ తేదీ వరకు కిన్నెరసాని క్రీడా పాఠశాలలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి క్రీడా పోటీలను విజయవంతం చేయాలని ఐటీడీఏ పీవో ప్రతీక్ జైన్ అన్నారు. బుధవారం తన చాంబర్‌లో ఉమ్మడి జిల్లాలోని ఏటీడీవోలతో రాష్ట్రస్థాయి గిరిజన క్రీడలకు సంబంధించిన ఏర్పాట్లపై ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 2 వేల మంది క్రీడాకారులు పాల్గొంటున్న పోటీల్లో క్రీడాకారులకు అసౌకర్యాలు కలగకుండా పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలన్నారు. ఆయా క్రీడా పోటీలకు సంబంధించిన మైదానాలు, కోర్టులను క్రీడాధికారులు పరిశీలించి మరమ్మతులు ఉన్నట్లైతే బాగు చేయించాలన్నారు. శాఖలవారీగా సంబంధిత అధికారులు, సిబ్బంది సమన్వయం చేసుకుంటూ క్రీడా పోటీలను సమర్థంగా నిర్వహించాలన్నారు. ఏమాత్రం అశ్రద్ధ వహించినా చెడ్డపేరు వచ్చే అవకాశం ఉందన్నారు. క్రీడల్లో పాల్గొనే బాలబాలికలకు, వారి వెంట వచ్చే లైజన్ ఆఫీసర్లు, పీఈటీలు, పీడీలకు సరైన సౌకర్యాలు కల్పించాలని చెప్పారు. క్రీడాకారులకు ప్రత్యేక మెనూ అమలు చేయాలని ఆయన సూచించారు. సమావేశంలో ట్రైబల్ వెల్ఫేర్ డీడీ మణెమ్మ, ఈఈ ట్రైబల్ వెల్ఫేర్ తానాజీ, ఏసీఎంవో రమణయ్య, క్రీడల అధికారి బీ.గోపాలరావు, ఏటీడీవోలు నర్సింహారావు, చంద్రమోహన్, జహీరుద్దీన్, రూపాదేవి, ఏఎస్వో వెంకటనారాయణ, నాగేశ్వరరావు, రాంబాబు, నెహ్రూ తదితరులు పాల్గొన్నారు.